## క్లుప్తంగా

### వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మునగపాకలో సిల్టు తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. మునగపాకలో పలు చోట్ల కాలువల్లో చేపట్టిన సిల్టు తొలగింపు పనులను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

### ఆవ కాలువలో తూటికాడ తొలగింపు



తోటాడ ఆవ కాలువలో తూటికాడ తొలగిస్తున్న రైతులు

మునగపాక: మండలంలోని తోటాడ ఆవకాలువలో పేరుకుపోయిన తూటికాడను రైతులు ప్రాణాలకు తెగించి తొలగింపు చేపట్టారు. తూటికాడ అడ్డంకి కారణంగా ఆవ కాలువలోని నీరు కిందకు వెళ్లే పరిస్థితులు లేకపోవడంతో పంట పొలాలకు ముంపు సమస్య తలెత్తింది. దీంతో పలువురు రైతులు కాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్నా మంగళవారం దిగి తూటికాడ తొలగింపు చేపట్టారు.

### పాములవాకలో జంగిల్ క్లియరెన్స్



పాములవాకలో జంగిల్ క్లియరెన్సు చేస్తున్న దృశ్యం

కోటవురట్ల: రహదారుల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. మలుపుల్లో ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో పాములవాకలో సర్పంచ్ డి.సత్యవతి, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు స్పందించి పిచ్చిమొక్కల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. మంగళవారం ప్రొక్లెయిన్‌తో పాములవాక పరిధిలోని శివారు గ్రామాల రహదారుల్లో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు.

### నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి : ఖరీఫ్ సీజన్‌లో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వారిని ప్రభుత్వమే ఆదుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఏజే చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ ఏడాది జూలైలో విత్తనాలు చల్లేటప్పుడు ఒక తుపాను, వరి నాట్ల సమయంలో మరో తుపానుతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, పంట కాలువల్లో పూడికలు తీయకపోవడం వల్ల వర్షపు నీరు పొలాల్లో నిలిచిపోయిందన్నారు. నీట మునిగి పంటలను సకాలంలో గుర్తించి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యుల సంఘం నాయకుడు బొడ్డు సోమరాజు, రైతు సంఘం నాయకుడు ఆదారి బుచ్చిరాము, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొబ్బిలి గోవిందరాజులు, నటభూషణ శోభన్‌బాబు సేవా సమితి చైర్మన్ ముగడా అప్పారావు, మత్స్యకారుల సంఘం నాయకుడు వాసుపల్లి తాతయ్య, సామాజిక సేవకుడు బర్నికాన భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# కాలుష్యం.. తాండవం

**డంపింగ్ యార్డ్‌గా మారిన నది**

**తాండవ నదిలో కాలుష్యం తాండవిస్తోంది. తుని మున్సిపాలిటీ, పాయకరావుపేట పంచాయతీ అధికారులు విపరీతంగా చెత్తను డంప్ చేస్తూ అనధికార డంపింగ్ యార్డ్‌గా మార్చేశారు. చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాటు ఆక్రమణలకు గురవడంతో కుచించుకుపోతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాండవ ఉనికి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. క్రమంగా కాలుష్యకాసారంగా మారుతోంది.**



తుని వైపున రాజుల గోళీల వద్ద తాండవ నదిలో వేస్తున్న తుని మున్సిపాలిటీ చెత్త



ఇరువైపులా వేస్తున్న చెత్తతో మూసుకుపోతున్న తాండవ నది

పాయకరావుపేట: తాండవ నది పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. పాయకరావుపేట పంచాయతీ, తుని మున్సిపాలిటీకి చెందిన వందలాది టన్నుల చెత్తను తాండవ నదిలో వేస్తుండడంతో డంపింగ్ యార్డ్‌గా మారింది. తాండవ నదిపై నిర్మించిన ముఠా ఆనకట్ట వద్ద పాయకరావుపేట పంచాయతీ చెత్తను, అవలి ఒడ్డును తుని మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను పెద్ద ఎత్తున డంప్ చేస్తున్నారు. గోనె సంచులు, చేపల మార్కెట్, చికెన్ సెంటర్ల నుంచి వస్తున్న వ్యర్థాలను నదిలోనే పడేస్తున్నారు. దీంతో నది పూర్తిగా కాలుష్య కోరల్లో చిక్కుకుంది. ఈ నీటిని తాగుతున్న జీవాలు వ్యాధుల బారిన పడుతున్నాయి. చెత్త భారీగా పేరుకుపోడంతో తాండవ నదీ గర్భం కుచించుకుపోతోంది. ఈ నదిపై ఆధారపడి మండలంలో 24 గ్రామాల్లో వేలాది ఎకరాలు సాగవుతున్నాయి. తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ నది నీటినే వినియోగిస్తున్నారు. తాండవ గర్భం కుచించుకుపోవడంతో సాగునీరు సక్రమంగా సరఫరా కాక రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో చుట్టూ పచ్చని చెట్లతో ఆహ్లాదంగా ఉండే నదీ పరీవాహక ప్రాంతం ఇప్పుడు రోతపుట్టించే విధంగా మారింది. గతంలో తుపాన్లు వచ్చిన సమయంలో నదిలో నీరు ఉధృతంగా ప్రవహించింది. చెత్త కారణంగా ముందుకు వెళ్లే మార్గం లేకపోవడంతో మంగవరం, సత్యవరం, మాసాహేబ్ పేట ప్రాంతాల్లోకి నీరు చొచ్చుకు వచ్చింది. చెత్త డంపింగ్ ఇలాగే కొనసాగితే తుపాన్ల సమయంలో తాండవ నీరు పాయకరావుపేట పట్టణంలోని పల్లపు ప్రాంతాలను ముంచెత్తే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి నదీ పరీవాహక ప్రాంతంలో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని, కాలుష్యం నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

### నోటీసులు ఇచ్చాం



పాయకరావుపేట పంచాయతీకి, తుని మున్సిపాలిటీ అధికారులకు నోటీసులు జారీ చేశాం. అయినా పట్టించుకోకుండా చెత్తను తాండవ నది లోనే వేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం.

– కె.శ్రీరాంమూర్తి, ఏఈ,నీటి పారుదల శాఖ, పాయకరావుపేట

### ఖాళీ స్థలం లేకపోవడం వల్లే..

పట్టణంలో ఖాళీ స్థలం లేకపోవడం వల్ల తాండవ నది ఒడ్డున చెత్త వేస్తున్నాం. చెత్తను డంపింగ్ చేసేందుకు పట్టణంలో స్థలాన్ని పరిశీలిస్తున్నాం. నదిలో చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్.ఆర్.కె.వర్మ, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి, పాయకరావుపేట

## ప్రభుత్వ అసమర్థతతోనే భారీ నష్టం

- కానరాని తుఫాన్ ముందస్తు హెచ్చరికలు
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కంబాల జోగులు



నక్కపల్లి: ప్రకృతి విపత్తులు, వైపరీత్యాన్ని అంచనా వేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఆ ఫలితమే విజయవాడలో ఊహించని నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని వైఎస్సార్‌సీపీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ ప్రభుత్వ అసమర్థతతోనే భారీ నష్టంతో పాటుగా ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. విజయవాడలో వరద వచ్చి 9 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ సాయం అందకపోవడం బాధాకరమన్నారు. ఆకలి కేకలు, నిరాశ, నిస్పృహలతో గడుపుతున్న బాధితుల తీరును సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో చూస్తుంటే కడుపు తరుక్కుపోతోందన్నారు. 14 ఏళ్ల పాలనానుభవం అని పదే పదే చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు, విజయవాడ మహానగరంలో వరదల్లో చిక్కుకున్న ప్రజలను పూర్తి స్థాయిలో ఆదుకోలేకపోయారంటే ఆయన దక్షత ఏపాటిదో అర్థమవుతోందన్నారు. బాధితులను సహాయక శిబిరాలకు తరలించకపోవడం ప్రభుత్వ వైఫల్యంగా పేర్కొనవచ్చునన్నారు. ఆగస్టు 30 నుంచి భారీ వర్షాలు వస్తాయని, వరద ముప్పు ఉంటుందని ముందస్తు హెచ్చరికలు ఉన్నప్పటికీ ప్రభుత్వం అప్రమత్తం కాకపోవడంతో భారీ నష్టం వాటిల్లిందన్నారు. ముందుగానే నీటిపారుదల, రెవెన్యూ, హోంశాఖ కార్యదర్శులతో సమీక్షించి, బాధ్యతలు అప్పగించి, దిశా నిర్దేశం చేసి ఉంటే ఇంత ఘోరం జరిగి ఉండేది కాదని జోగులు అభిప్రాయపడ్డారు. వరద సహాయక చర్యల్లో ముఖ్యమంత్రి, టీడీపీ నాయకులది ప్రచార ఆర్భాటం, హడావుడి తప్ప.. బాధితులను ఆదుకోవాలన్న తపన ఎక్కడా కనిపించలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన వలంటీర్ల వ్యవస్థను సహాయక చర్యల్లో వినియోగించి ఉంటే ప్రజలకు కొంత మేరైనా ఉపశమనం లభించేదన్నారు. ముఖ్యమంత్రి అధికారక నివాసం, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ పవర్ ప్లాంట్ మునిగిపోకుండా కాపాడేందుకు బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ మీదకు వదలారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ సహాయక చర్యలు కూడా నీళ్లులేని ప్రాంతాల్లో మాత్రమే కొనసాగాయన్నారు. వరదల కారణంగా సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. దీనిపై పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం మెయింటెనెన్స్, బంగారమ్మపాలెం రూట్‌లో కొత్త విద్యుత్ లైను ఏర్పాటు పనుల కారణంగా గుడివాడ, సోమిదేవపల్లి, వమ్మవరం ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గుడివాడ, పెదఉప్పలం, ఎల్‌పీఆర్ పేట, కొత్తపోలవరం, కొత్తరేవు పోలవరం, బంగారమ్మపాలెం, చినఉప్పలం, వమ్మవరం, గెడ్డపాలెంలె విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. గుడివాడ, గుర్రాజుపేట పరిశ్రమలు, చినఉప్పలం ఆక్వా చెరువులకు కూడా సరఫరా నిలిపివేస్తామన్నారు.

## సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



షేకిళ్లపాలెంలో సంపద తయారీ కేంద్రంలో వానపాములను వదులుతున్న డీపీవో శిరీషారాణి, డీపీఆర్‌సీ సమన్వయకర్త నాగలక్ష్మి

యలమంచిలి రూరల్: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తిగా వినియోగంలోకి తేవాలని జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషారాణి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం యలమంచిలి మండలం షేకిళ్లపాలెంలో సంపద తయారీ కేంద్రాన్ని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం సమన్వయకర్త నాగలక్ష్మితో కలిసి ఆమె తనిఖీ చేశారు. ఈ కేంద్రంలో వర్మీకంపోస్టు ఎరువు తయారీకి వానపాములను విడిచిపెట్టారు. జిల్లాలో 646 పంచాయతీల్లో 515 సంపద తయారీ కేంద్రాల షెడ్లు నిర్మించగా, వాటిలో చాలా వరకు వినియోగంలో లేవన్నారు. ఈ కేంద్రాలన్నీ అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి నాటికి వినియోగంలోకి తేవడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. మండల పంచాయతీ విస్తరణాధికారులు తరచూ కేంద్రాలను సందర్శించి వాటి పనితీరు మెరుగుపర్చడానికి కృషి చేయాలని సూచించారు. క్లాప్ మిత్రలతో మాట్లాడి కేంద్రాల పనితీరు మెరుగుపడేలా చూడాలన్నారు. అనంతరం షేకిళ్లపాలెం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష జరిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సేకరించిన చెత్తతో వర్మీ కంపోస్టు తయారీ చేయడం ద్వారా పంచాయతీలకు ఆదాయం పెరిగేందుకు ఈ కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్య లోపం తలెత్తకుండా పర్యవేక్షించాలన్నారు. పంచాయతీల్లో ఆస్తి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని డీపీవో కార్యదర్శులకు సూచించారు. యలమంచిలి ఎంపీడీవో కె.అప్పలనాయుడు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, షేకిళ్లపాలెం పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ రాస్తారోకో



అచ్యుతాపురంలో రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ నాయకులు

అచ్యుతాపురం(మునగపాక): స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించడంతో పాటు ప్రైవేటీకరణ చర్యలను విరమించుకోవాలని కోరుతూ మంగళవారం అచ్యుతాపురం జంక్షన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము మాట్లాడుతూ విశాఖ ఉక్కు–తెలుగువారి హక్కు నినాదాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ స్థలాలు, పరిశ్రమను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు కేంద్రం కుతంత్రాలు పన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సోమునాయుడు, వెంకయ్యనాయుడు, సూరిబాబు, రాము, శ్రీను, అప్పలరాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మహత్యల నివారణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సర్వసిద్ధి పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థులు

ఎస్.రాయవరం: క్షణికావేశంలో బలవంతంగా నిండు ప్రాణాన్ని తీసుకుని కుటుంబానికి తీరని లోటు చేసుకుంటున్నారని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.వాసంతి అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంపై మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంత కష్టమొచ్చినా ఆత్మహత్యలకు పాల్పడకుండా ధైర్యంగా నిలబడి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆపన్నులను ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి



వరద బాధితులకు పంపుతున్న సరకుల వ్యాన్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ అప్పారావు

అనకాపల్లి : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఎంతో సంతృప్తి ఉంటుందని డీఎస్పీ అప్పారావు అన్నారు. తుమ్మపాల గ్రామంలో ఎస్‌వీడీఎస్ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు, మిల్లెట్స్ మంగళవారం విజయవాడ వరద బాధితులకు పంపిస్తున్న వ్యాన్‌ను ప్రారంభించారు. డివిజన్ పరిధి వివిధ ప్రాంతాల నుంచి పలు స్వచ్ఛంద సంస్థలు సహాయం చేస్తున్నాయని, ఎస్‌వీడీఎస్ సంస్థ ద్వారా 10 బస్తాల బియ్యం, మిల్లెట్ పౌడర్, గోధుమ పిండి, దుప్పట్లు, బిస్కెట్లు, శానిటరీ ప్యాడ్లు పంపించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, ఎస్‌వీడీఎస్ కార్యదర్శి జోగి నాయుడు, సభ్యులు సత్యనారాయణ, వీజేఎస్ఎస్ఎస్ శివ, మాధవి పాల్గొన్నారు.

## తక్కువ వ్యయంతో అధిక పోషకాహారం



కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమణమ్మ

మాడుగుల రూరల్: తక్కువ వ్యయంతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ, ఎంతో ఆరోగ్యకరంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.వి.రమణమ్మ పేర్కొన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా, కె.జె.పురం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహారం ఆవశ్యకత గురించి బాలింతలు, గర్భిణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆకు కూరలు, బెల్లం, మునగ ఆకు, అటుకులు, తెలగ పిండితో చేసిన ఆహారం తీసుకోవాలని, బాలామృతం కూడా ఎంతో శ్రేష్ఠమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పి.చంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తక్కువ వ్యయంతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు.

# ఇంకా ముంపులోనే వరి పొలాలు



అన్నవరంలో చెరువులా ఉన్న వరిచేను



తోటాడ త్రిమూర్తుల గుడి సమీపంలో వరదనీటి ఉధృతి

కోటవురట్ల: భారీ వర్షాలు రైతులను నిలువునా ముంచేశాయి. కుండపోతగా కురిసిన వర్షంతో పంట పొలాల్లో భారీగా నీరు నిలిచిపోయింది. పత్తి, దుంప తోటలు, కూరగాయలు, వరి చేలను ముంచెత్తిన వర్షపు నీరు రెండు రోజులైనా ఇంకా బయటకు పోలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్నవరం, జల్లూరు, యండపల్లి, కైలాసపట్నం, రాజుపేట ప్రాంతాలలో వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

**తగ్గని వరద ఉధృతి**

మునగపాక: వర్షం తగ్గుముఖం పట్టినా ఇప్పటికీ నదులు, గెడ్డల్లో వరద ఉధృతి తగ్గలేదు. ఎగువన భారీ వర్షాలు కురవడంతో దిగువ ప్రాంతాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో పొలాలు ముంపునకు గురయ్యాయి. తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలోని ఆవ కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. మునగపాకలోని సంతబయల శీలప్పన చెరువు వర్షపు నీటితో కళకళలాడుతోంది. కృష్ణంరాజు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. చూచుకొండ–గణపర్తి బ్రిడ్జి వద్ద రోలుగెడ్డ ప్రవాహం కూడా ఎక్కువగా ఉంది. మునగపాకలోని సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన తూటికాడ తొలగింపు పనులను రైతులు చేపట్టారు. వాడ్రాపల్లి ఆవ ప్రాంతంలో ఇంకా వరి పొలాలు వరదనీటిలోనే ఉన్నాయి.

ఎస్.రాయవరం: మండలంలో నీట మునిగిన పొలాలను వ్యవసాయాధికారులు, ఇరిగేషన్ శాఖ అధికారులు పరిశీలించారు. వరద నీరు తగ్గుముఖం పట్టడంతో అన్నదాతలు ఊపిరి పీల్చుకుంటున్నారు. సర్వసిద్ధి, సైతారుపేట, పేట సూధిపురం, లింగరాజుపాలెం, ఉప్పరాపల్లి, వాకపాడు తదితర ప్రాంతాల్లో పంట నష్టం వాటిల్లింది.

**నీట మునిగిన వరి పంట పరిశీలన**

పాయకరావుపేట: మండలంలో నీట మునిగిన గుంటపల్లి, నామవరం, మంగవరం, గోపాలపట్నం గ్రామాల్లోని వరి పొలాలను మండల నీటి పారుదల శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు కె.శ్రీరామమూర్తి, పి.ఆదినారాయణ, సిబ్బంది పరిశీలించారు. ఆయా గ్రామాల రైతులు పంట నష్టాన్ని అధికారులకు స్వయంగా వివరించారు. ముంపునకు గురైన పంట నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



మునగపాక సాగునీటి కాలువలో తూటికాడ తొలగింపు పనులు



ఎస్.రాయవరంలో పొలాలను పరిశీలిస్తున్న అధికారులు



ఆవ ముంపునకు గురైన వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

## ప్రమాదకరంగా ప్రయాణం



ఆటోలో ఇలా కూలీల ప్రయాణం

అచ్యుతాపురం(మునగపాక): పరిమితికి మించి ప్రయాణికులతో పలు ఆటోలు రాకపోకలు సాగిస్తూ ప్రమాదకరణంగా తయారయ్యాయి. మునగపాక మండలం రామగిరి నుంచి 22 మంది కూలీలతో అచ్యుతాపురం మండలం జగన్నాథపురం మీదుగా వెళ్తున్న ఆటోను చూసిన వారంతా నివ్వెరపోవాల్సి వచ్చింది. డ్రైవర్ సీటుకు రెండు వైపులా నలుగురు, అలాగే వెనుకవైపున బల్లపై నలుగురు, ఆటో డోరు వద్ద మరో నలుగురు, లోపల మరో 10 మంది.. వెరసి 22 మంది ప్రయాణించారు. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



పైలట్ ప్రాజెక్టు వద్ద నిలిపివేసిన ఆర్టీసీ బస్సు

కోటవురట్ల: రామచంద్రపురం జంక్షన్‌లో వంతెన శిథిలం కావడంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. నర్సీపట్నం నుంచి అడ్డురోడ్డు వెళ్లే ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇదే అదనుగా ఆటోవాలాలు సొమ్ము చేసుకుంటున్నారు. నర్సీపట్నం డిపో నుంచి మండలంలోని రామచంద్రపురం శివారు పైలట్ ప్రాజెక్టు వరకు బస్సులను నడుపుతున్నారు. వంతెనకు అవతలి నుంచి అడ్డురోడ్డు వరకు ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే ఆర్టీసీ సిబ్బంది తీరుతో ప్రయాణికులు మరింత ఇబ్బంది పడుతున్నారు. కనీసం వంతెన వరకు కూడా బస్సును తీసుకెళ్లకుండా సుమారు కిలోమీటరు ముందుగా పైలట్ ప్రాజెక్టు వరకు నడుపుతున్నారు. దాంతో లగేజీ, పిల్లలతో కిలోమీటరు నడిచి వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం వంతెన వరకు అయినా బస్సులను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## నర్సీపట్నంలో 13న వ్యాసరచన పోటీలు

నర్సీపట్నం : ఈ నెల 16న జరగనున్న అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామని గ్రీన్ క్లబ్ అధ్యక్షుడు డి.గోపీనాథ్ తెలిపారు. పోటీలు ఈ నెల 13న నర్సీపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అందరూ పాల్గొనవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మేలు జాతి పశువుల పెంపకం చేపట్టాలి



మాట్లాడుతున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆనంద్‌కుమార్

కె.కోటపాడు : పాడి రైతులు మేలు జాతి పాడి పశువుల పెంపకం చేపట్టాలని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. బత్తివానిపాలెంలో మంగళవారం కె.కోటపాడు, దేవరాపల్లి, లక్కవరపుకోట, వేపాడ మండలాల పాల సంఘాల అధ్యక్షులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ డెయిరీ పరిధిలో గల సభ్య రైతుల పశువులకు ఆడపెయ్యిల ఉత్పత్తి పథకంలో భాగంగా తక్కువ ధరకే వీర్యాన్ని అందించే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విధానం ద్వారా 95శాతం పశువులకు ఆడపెయ్యిలు జన్మించి పాడి రైతులకు ఆదాయ వనరుగా మారుతుందన్నారు. విశాఖడెయిరీ పరిధిలో గల ప్రతి రైతు కుటుంబానికి ఎల్లప్పుడూ అండి మేలైన కార్యక్రమాలను అమలు చేస్తామని తెలిపారు. సంస్థ బోర్డు డైరెక్టర్లు సుందరపు గంగాధర్, కాటమయ్య, శీరంరెడ్డి సూర్యనారాయణ, శరగడం శంకరరావు, దాడి పవన్‌కుమార్, రెడ్డి రామకృష్ణ, జనరల్ మేనేజర్ కుమార్, పాండ్యరాజన్, మేనేజర్ అప్పారావు, పలు సొసైటీల అధ్యక్షులు పాల్గొన్నారు.